వైఎస్సార్ నగర్ అభివృద్ధికి చర్యలు

- రూ.1.70 కోట్లతో మౌలిక సదుపాయాల కల్పన
- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం:

దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి పేరిట నిర్మించిన వైఎస్సార్ నగర్ అభివృద్ధికి అన్ని చర్యలు చేపడుతున్నట్లు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. నగరంలోని 50వ డివిజన్ పరిధిలో గల వైఎస్సార్ నగర్ ఆర్చి నుంచి ప్రారంభమైన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు, పార్టీ నాయకులు కోలగట్లను ఘనంగా సత్కరించారు. అనంతరం కోలగట్ల స్థానిక నాయకులతో కలసి ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. ఒక్కో కుటుంబానికి పథకాల వల్ల కలిగిన లబ్ధిని వివరిస్తూ ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్పొరేషన్ ఫ్లోర్‌లీడర్ ఎస్‌వీవీ రాజేష్ మాట్లాడుతూ, వైఎస్సార్ నగర్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామన్నారు. ఇల్లు లేని వారందరికీ వైఎస్సార్ నగర్‌లో పట్టాలు ఇచ్చి, ఇళ్లు నిర్మించడంలో కోలగట్ల కృషి ఎంతో ఉందన్నారు. మహానేత వైఎస్సార్ పేరిట నిర్మించిన కాలనీలో మౌలిక సదుపాయాల కల్పనకు కోటీ 70 లక్షల రూపాయలు మంజూరు చేసినట్లు చెప్పారు. నగర్‌లో 3,500 మందికి గృహ సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. ఈ ప్రాంతంలో అద్దెకు ఉన్న పేదలకు గుంకలాంలోను, టిడ్కో ఇళ్లను మంజూరు చేశామన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ప్రజాస్పందన బాగా వస్తోందన్నారు. జోనల్ ఇన్‌చార్జ్ ముచ్చు శ్రీనివాసరావు మాట్లాడుతూ, నగరాభివృద్ధికి కోలగట్ల వీరభద్రస్వామి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. మారుమూల ప్రాంతాలలో సైతం సంపూర్ణ మౌలిక సదుపాయాలు కల్పిస్తూ, ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నారని కొనియాడారు. మాజీ కౌన్సిలర్ తోనంగి జగన్నాథరెడ్డి మాట్లాడుతూ, తమ ప్రాంతంలో అవసరమైన సౌకర్యాలను కల్పించడంలో కోలగట్ల వీరభద్రస్వామి ప్రత్యేక దృష్టి కేంద్రీకరించడం సంతోషదాయకమన్నారు. కార్యక్రమంలో మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, స్థానిక కార్పొరేటర్ పట్టా ఆదిలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



విజయనగరం: లబ్ధిదారులతో మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, తదితరులు

సంక్షేమ పథకాలపై ఆరా...

విజయనగరం: నగరంలోని 29, 42 డివిజన్‌లలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, జోనల్ ఇన్‌చార్జి కృష్ణారావు, డాక్టర్ వి. ఎస్. ప్రసాద్ , తమ్మన్నశెట్టి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు ఎలా అందుతున్నదీ ఆరా తీశారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ ప్రసాదరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు పిన్నింటి కళావతి, సూర్యనారాయణ, కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



విజయనగరం: పట్టణంలోని గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొని వైఎస్సార్‌సీపీ నాయకులు

ప్రజల దృష్టిని మళ్లించేందుకే అసత్య ఆరోపణలు



నెల్లిమర్ల రూరల్: లబ్ధిదారులకు బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు, తదితరులు

- ఎమ్మెల్యే బడ్డుకొండ, ఎమ్మెల్సీ పెనుమత్స

నెల్లిమర్ల రూరల్: ప్రజల దృష్టిని మళ్లించేందుకే ప్రతిపక్షాలు ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు చేస్తున్నాయని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. నగర పంచాయతీ పరిధిలోని జరజాపుపేటలో వైస్ చైర్మన్ రామారావు ఆధ్వర్యంలో 1, 20 వార్డుల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ముందుగా ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్ బాబుతో కలిసి వలంటీర్లు, సచివాలయ సిబ్బందితో ఎమ్మెల్యే సమావేశమయ్యారు. ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై ఆరా తీశారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్ల కాలంలో ప్రభుత్వం చేసిన మంచిని వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బడ్డుకొండ మాట్లాడుతూ, గతంలో జన్మభూమి కమిటీలు చేసిన అవినీతి, దోపిడీలను ప్రజలు మరిచిపోలేదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గతంలో ఎన్నడూ లేనివిధంగా జరజాపుపేటలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ప్రజల సంక్షేమం కోసం పలు పథకాలను ప్రవేశపెట్టి సమర్థవంతంగా అమలు చేస్తున్నామన్నారు. మంచి చేస్తున్న ప్రభుత్వంపై బురదజల్లుతున్న ప్రతిపక్షాలకు రానున్న ఎన్నికల్లో మరోసారి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

అభివృద్ధే నినాదం

ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు మాట్లాడుతూ, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఓట్ల రాజకీయంతో సంబంధం లేకుండా అభివృద్ధి నినాదంతో ప్రభుత్వ పాలన సాగుతోందన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా సీఎం జగనన్న ప్రజలకు జనరంజక పాలన అందిస్తున్నారని చెప్పారు. ప్రజలకు మంచి చేస్తున్న ప్రభుత్వానికి రానున్న రోజుల్లో మద్దతు పలకాలని కోరారు. కార్యక్రమంలో కమిషనర్ బాలాజీప్రసాద్, నగర పంచాయతీ చైర్మన్ బంగారు సరోజినీ, వైస్ చైర్మన్లు సముద్రపు రామారావు, చిక్కాల సాంబశివరాజు, పార్టీ పట్టణ అధ్యక్షుడు చిక్కాల సాంబశివరావు, జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు చనమళ్ల వెంకటరమణ, కార్పొరేషన్ డైరెక్టర్లు మద్దిల వాసు, రేగాన శ్రీనివాసరావు, నాయకులు నల్లి శ్రీను, తుమ్ము నారాయణమూర్తి, పోలుబోతు నారాయణమూర్తి, మాతా సంధ్య, పాండ్రంకి సత్యనారాయణ, ఎం ఎం నాయుడు, మద్ది ల శ్రీను, మణ్యపురి మోహనరావు, బుగత శ్రీను, తుమ్ము వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఇంటింటి సర్వే పరిశీలన



బీఎల్‌ఓలతో మాట్లాడుతున్న ఏఈఆర్‌ఓ రామకృష్ణ

విజయనగరం రూరల్: విజయనగరం అసెంబ్లీ నియోజకవర్గంలోని కార్పొరేషన్ పరిధిలో ఓటర్ల నమోదుపై కొద్దిరోజులుగా జరుగుతున్న ఇంటింటి సర్వేను సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారి- 2 (ఏఈఆర్‌ఓ) తామరాపల్లి రామకృష్ణ బుధవారం పరిశీలించారు. కార్పొరేషన్ పరిధిలో ఉన్న 149, 150, 151 పోలింగ్ కేంద్రాల పరిధిలో బీఎల్‌ఓలు చేపడుతున్న ఇంటింటి సర్వేను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం బీఎల్‌ఓలతో వార్డు సచివాలయంలో సమావేశం నిర్వహించారు. ఓటర్ల నమోదు పక్కాగా చేపట్టాలన్నారు.

ట్రిపుల్ ఐటీకి మహారాజుపేట విద్యార్థిని



విద్యార్థిని చందక పల్లవిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ నాగరత్నం, ఉపాధ్యాయులు

భోగాపురం: మండలంలోని మహారాజుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన చందక పల్లవి క్రీడల కోటాలో శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీకి ఎంపికైంది. ఈ మేరకు విద్యార్థినిని పాఠశాల ప్రిన్సిపాల్ బి. నాగరత్నం, ఉపాధ్యాయులు అభినందించారు.

కెమికల్ ఇంజినీరింగ్‌తో ఉపాధి అవకాశాలు



ముఖ్య అతిథి సీతారాంను సత్కరిస్తున్న కళాశాల ప్రతినిధులు

డెంకాడ: కెమికల్ ఇంజినీరింగ్‌తో మంచి ఉపాధి అవకాశాలు లభిస్తాయని షెల్ ఇంటర్నేషనల్ కంపెనీ రిటైర్డ్ కెమికల్ సేఫ్టీ అడ్వైజర్ ఎస్.సీతారాం అన్నారు. చింతలవలస ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ, పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు భద్రతా నియమాలు పాటించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం సీతారాంను నిర్వాహకులు సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ పి.సీతారామరాజు, ప్రిన్సిపాల్ ఆర్.రమేష్, కెమికల్ విభాగాధిపతి బి.సర్వారావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అజోల్లాతో ఉపయోగాలు..

- ప్రకృతి వ్యవసాయశాఖ ఆర్‌టీఎల్ ప్రకాష్



వరి పొలంలో అజోల్లా వేస్తున్న అధికారులు, రైతులు

డెంకాడ: అజోల్లా ఉండగా యూరియా దండగ అని ప్రకృతి వ్యవసాయశాఖ రాష్ట్ర కార్యాలయ ఆర్‌టీఎల్ ప్రకాష్ అన్నారు. మండలంలోని సింగవరంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అజోల్లాతో కలుపును సులువుగా తొలగించవచ్చన్నారు. వరి పంటలో తేమశాతం పెరిగి పిలకలు అభివృదిధ చెందుతాయని చెప్పారు. రసాయన ఎరువులకు బదులు సేంద్రియ ఎరువుల వినియోగం పెంచాలని సూచించారు. అనంతరం గ్రామానికి చెందిన పలువురు రైతుల వరి పొలాల్లో రైతులతో కలిసి అధికారులు అజోల్లా వేశారు. కార్యక్రమంలో ఆర్‌టీఓ హేమసుందర్, ఏఈఓ రామకోటి, ప్రకృతి వ్యవసాయ ప్రతినిధి సుజాత, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి



కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటుతున్న ఏపీఎం, మేనేజర్, తదితరులు

నెల్లిమర్ల రూరల్: గ్రామాల్లో విరివిగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఏపీఎం సత్యనారాయణ, ఎస్‌బీఐ బ్యాంక్ మేనేజర్ ప్రవీణ్ అన్నారు. మండల కేంద్రంలోని వైఎస్సార్ క్రాంతిపథం కార్యాలయంలో వెలుగు సిబ్బందికి బుధవారం మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణలో ప్రతిఒక్కరూ భాగస్వామ్యం కావాలన్నారు. అనంతరం కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ మోసగాళ్లపై అప్రమత్తంగా ఉండండి

- వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు

విజయనగరం క్రైమ్: సైబర్ మోసగాళ్లపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వన్‌టౌన్ సీఐ బి. వెంకటరావు అన్నారు. నగరంలోని ఉడాకాలనీలో సైబర్ మోసాలు, చిట్టీలు, దొంగతనాలపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ, మొబైల్స్‌కు వచ్చే లింకులు, కేవైసీ అప్‌డేట్ పేరుతో మెసేజ్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. సైబర్ మోసాలకు పాల్పడే మోసగాళ్లు బ్యాంకు ఖాతాల్లో ఉన్న సొమ్మును కాజేసేందుకు అనేక రకాలుగా మెసెజ్‌లు, వాట్సాప్ సందేశాలు, ఈమెయిల్స్ పంపిస్తుంటారన్నారు. అటువంటి వాటికి ఎవ్వరూ స్పందించవద్దని సూచించారు. ఎక్కువ వడ్డీల ఆశతో చీటీలు వేసే వారి పట్ల కూడా జాగ్రత్తగా ఉండాలన్నారు. ఇళ్లు విడిచి దూర ప్రాంతాలకు వెళ్లే ముందు స్థానిక పోలీస్‌స్టేషన్‌కు ముందుగా సమాచారం అందిస్తే, ఆయా ఇళ్లపై నిఘా ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్సై అశోక్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధిపై కరపత్రాల విడుదల



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

నెల్లిమర్ల రూరల్: నగర పంచాయతీ పరిధిలోని జరజాపుపేట 18వ వార్డు అభివృద్ధిపై కౌన్సిలర్ నల్లి కృష్ణవేణి ఆధ్వర్యంలో రూపొందించిన కరపత్రాలను ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు బుధవారం ఆవిష్కరించారు. ఎన్నికల హామీ మేరకు వార్డులో సీసీ రహదారులు, డ్రైన్లు, మంచినీటి బోరు, విద్యుత్, వీధిలైట్లు, తదితర సౌకర్యాలు కల్పించామని.. రానున్న రోజుల్లో మరిన్ని సౌకర్యాలు కల్పిస్తామని కౌన్సిలర్ ప్రతినిధి శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు చిక్కాల సాంబశివరావు, వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, తదితరులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్ సెల్ ఫిర్యాదుపై విచారణ

భోగాపురం: మండలంలోని ముక్కాం జగనన్న లేఅవుట్‌లో ఇళ్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు సిమెంట్, ఐరన్ వంటి నిర్మాణ సామాగ్రి ఇవ్వకుండానే ఆన్‌లైన్‌లో ఇచ్చినట్లు అధికారులు చూపిస్తున్నారంటూ కొంతమంది లబ్ధిదారులు గ్రీవెన్స్‌సెల్‌లో ఇటీవల ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు గజపతినగరం హౌసింగ్ డీఈ ఎం.సత్యనారాయణ బుధవారం లేఅవుట్‌కు చేరుకుని ప్రజాప్రతినిధులు, లబ్ధిదారుల సమక్షంలో విచారణ చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, కాలనీలో 181 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు కేటాయించి, 139 మందికి పట్టాలు పంపిణీ చేసినట్లు చెప్పారు. ఇళ్ల పట్టాలు పొందిన వారిలో 85 మంది లబ్ధిదారులకు మెటీరియల్ అందజేసినట్లు ఆన్‌లైన్‌లో నమోదు చేశారని, అయితే 68 మంది లబ్ధిదారులకే మెటీరియల్ అందినట్లు విచారణలో తేలిందన్నారు. నివేదికలను ఉన్నతాధికారులకు సమర్పించి మిగిలిన లబ్ధిదారులకు మెటీరియల్‌ను అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ కొల్లి రాజేష్, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ బంగారమ్మ, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.